1st Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 3 సంచిక : 119
మంగళవారం 05 మే 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## పార్టీ స్థాపించిన అనతి కాలంలోనే గొప్ప విజయం.. విజయ్‌పై పవన్ కల్యాణ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 04)

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం ఎన్నికల ఫలితాల్లో మరోసారి ఓటర్ల చైతన్యం స్పష్టంగా కనిపించిందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పాలన నచ్చితే మళ్లీ మళ్లీ గెలిపిస్తారని.. నచ్చకపోతే నిర్దాక్షిణ్యంగా ఓడిస్తారనడానికి ఈ ఫలితాలే చక్కటి ఉదాహరణ అని పేర్కొన్నారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రజలు ఈసారి మార్పును బలంగా కోరుకున్నారన్నారు. అస్సాం, పుదుచ్చేరిలో తమ ప్రాభవాన్ని నిలబెట్టుకుని.. పశ్చిమ బెంగాల్ ప్రజల మనసును గెలుచుకున్న భాజపా విజయం వెనక ఆ పార్టీ అగ్రనాయకత్వం అకుంఠిత దీక్ష ఉందని కొనియాడారు. పశ్చిమ బెంగాల్ వాసుల నమ్మకాన్ని గెలుచుకోవడంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా గత కొన్ని సంవత్సరాలుగా చేసిన కృషి ఇప్పుడు ఫలితాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ, అమిత్ షా, భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తదితరులకు పవన్‌కల్యాణ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ▶మిగతా 2లో

## రెండు చోట్లా విజయమే..



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 04)

నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) చీఫ్ విజయ్ సంచలనం సృష్టించారు. తమిళ రాజకీయాల్లో అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేసి చూపించారు. పార్టీని స్థాపించిన కేవలం రెండేళ్లకే చరిత్ర లిఖించారు. టీవీకే ఏర్పాటు తర్వాత తొలిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలతో 'విజిల్' వేయించి మెజార్టీ స్థానాలు గెలవడం ద్వారా అటు సినిమాల్లోనే కాదు.. ఇటు పాలిటిక్స్‌లోనూ 'సూపర్ హిట్' కొట్టారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగిన విజయ్.. రెండు చోట్లా తన సమీప ప్రత్యర్థులను ఓడించి సత్తా చాటారు.

**కింగ్ మేకరే అన్నారు.. కానీ..!**

కొన్ని ఎగ్జిట్‌పోల్స్, కొందరు రాజకీయ విశ్లేషకులు ఈ ఎన్నికల్లో విజయ్ ప్రభావం అంతగా ఏమీ ఉండకపోవచ్చని.. ఆయన ఓట్లు చీలుస్తారని, ఒకవేళ హంగ్ వస్తే ఆయన కింగ్‌మేకర్ అవుతారంటూ రకరకాల అంచనాలను వెలువరించారు. కానీ, వాటన్నింటినీ తారుమారు చేస్తూ టీవీకే అనూహ్యంగా అత్యధిక స్థానాలు గెలుచుకొని ఆయన కింగ్‌గా అవతరించడం ఇప్పుడు దేశమంతా హాట్‌టాపిక్ అయింది. ఇప్పటివరకు వచ్చిన ఫలితాలను చూస్తే.. మొత్తం 234 సీట్లకు గాను టీవీకే 100కి పైగా స్థానాల్లో గెలుపు/ఆధిక్యంలో ఉండగా.. అధికార డీఎంకే కూటమి 70కి పైగా, అన్నాడీఎంకే కూటమి 50కి పైగా స్థానాల్లో గెలుపు/ఆధిక్యంలో కొనసాగుతున్నాయి. ఈ అపూర్వ విజయంతో మంచి జోష్‌లో ఉన్న టీవీకే శ్రేణులు, నేతలు ప్రభుత్వ ఏర్పాటు దిశగా ముమ్మర కసరత్తు చేస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే విజయ్ మే 7న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు వార్తలొస్తున్నాయి.

**తన కారు డ్రైవర్ కొడుకుకు సీటిచ్చి..**

విజయ్ అత్యంత సామాన్యులకే సీట్లు కేటాయించడం ద్వారా తనదైన మార్కు చూపించారు. అలా ఎంచుకున్న వ్యక్తి చేతుల్లోనే సీఎం స్టాలిన్ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. రాజకీయ వారసత్వానికి భిన్నంగా విజయ్ క్షేత్రస్థాయి కార్యకర్తలకే సీట్లు ఇవ్వడంతో ప్రజలూ భిన్నంగా ఆలోచించారు. తన వద్ద దాదాపు 30 ఏళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేసి, ప్రస్తుతం సహాయకుడిగా కొనసాగుతున్న రాజేంద్రన్ కుమారుడు శబరినాథన్‌ను చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం నుంచి విజయ్ బరిలో దించగా.. డీఎంకే అభ్యర్థిపై ఆయన ఆధిక్యంతో స్పష్టమైన విజయం దిశగా దూసుకెళ్తుండటం విశేషం.

**ఆటోడ్రైవర్ అపూర్వ విజయం..**

అలాగే, రోయపురం నియోజకవర్గంలో ఓ ఆటో డ్రైవర్‌కు విజయ్ సీటు ఇచ్చారు. ఈ స్థానం నుంచి బరిలో నిలిచిన ఆటో డ్రైవర్ కె.విజయ్ ధాము శక్తిమంతమైన రాజకీయ వారసత్వం కలిగిన వ్యక్తులనే ఓడించి అద్భుత విజయం సాధించారు. ఐదు సార్లు ఎమ్మెల్యే డా.జయకుమార్ (అన్నాడీఎంకే), మాజీ మంత్రి రెహ్మాన్ ఖాన్ తనయుడు సుబైర్ ఖాన్‌లను ఓడించి సరికొత్త రికార్డు నెలకొల్పారు. విజయ్ ధాముకు మొత్తంగా 59,091 ఓట్లు రాగా.. తన సమీప ప్రత్యర్థి, డీఎంకే అభ్యర్థిపై 14,249 ఓట్ల మెజార్టీతో గెలుపొందడం విశేషం.

## గత ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్ల అప్పు భారం మోపింది నారాయణ

నెల్లూరు దస్తగిరి నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేసిన నారాయణ

ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని వ్యాఖ్య

రాష్ట్ర ఆర్థిక స్థితిని చక్కదిద్దుతున్నామని వెల్లడి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 04)

నెల్లూరు జిల్లాలో అభివృద్ధి పనులకు మంత్రి నారాయణ శ్రీకారం చుట్టారు. దస్తగిరి నగర్‌లో రూ. 1.43 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నెల్లూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం ▶మిగతా 2లో

## కంగ్రాచ్యులేషన్స్ విజయ్

### ఏపీ మంత్రి నారా లోకేశ్

తమిళనాడు ఎన్నికల్లో విజయం దిశగా టీవీకే

నటుడు విజయ్‌కు అభినందనలు తెలిపిన నారా లోకేశ్

విజయ్ ఎన్నికల అరంగేట్రం అద్భుతమని ప్రశంస



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 04)

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం దిశగా దూసుకుపోతూ, రాజకీయ అరంగేట్రంలో సత్తా చాటిన నటుడు విజయ్‌కు ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. విజయ్ ఎన్నికల ప్రస్థానం అద్భుతంగా మొదలైందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా లోకేశ్ స్పందిస్తూ, "తమిళనాడులో ▶మిగతా 2లో

## తమిళనాడు ఓటర్లకు మోదీ కృతజ్ఞతలు.. విజయ్ పార్టీకి ప్రత్యేక అభినందనలు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు మద్దతిచ్చిన ప్రజలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 04)

2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ఎన్నికల్లో తమ నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీయే)కు మద్దతుగా నిలిచిన తమిళనాడు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో, తొలిసారి ఎన్నికల బరిలో నిలిచి సత్తా చాటిన నటుడు విజయ్, ఆయన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు అభినందనలు తెలియజేశారు. ఫలితాల వెల్లడి అనంతరం ▶మిగతా 2లో

## విజయ్‌కి అభినందనలు.. దీదీకి సానుభూతి: ఎన్నికల ఫలితాలపై జగన్

తమిళనాడు ఎన్నికల ఫలితాలపై స్పందించిన ఏపీ మాజీ సీఎం జగన్


(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 04)

దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతున్న వేళ ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ స్పందించారు. ముఖ్యంగా తమిళనాడులో నటుడు దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి ఎన్నికల్లోనే సంచలన ప్రదర్శన చేయడంపై ఆయన ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు జగన్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు.



"నా ప్రియ సోదరుడు విజయ్‌కు హృదయ పూర్వక అభినందనలు. రాజకీయాల్లోకి వచ్చి, తొలిసారి పోటీ చేసిన ఎన్నికల్లోనే అతిపెద్ద పార్టీగా అవతరించడం నిజంగా గొప్ప విషయం. ప్రజాసేవలో మీరు ప్రారంభించిన ఈ కొత్త అధ్యాయంలో మీకు మరింత శక్తి, విజయం చేకూరాలని ఆకాంక్షిస్తున్నాను. దేవుడు మీకు తోడుగా ఉండాలి" అని జగన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ▶మిగతా 2లో

## ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్..



### సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- ఏపీ ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్లుగా నిలపాలన్న సీఎం చంద్రబాబు
- పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ తప్పనిసరి
- రవాణా వ్యయం తగ్గింపు అత్యంత కీలకమని స్పష్టీకరణ
- పరిశ్రమలు, మౌలిక వసతులు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి
- ప్రతి జిల్లాలో మెగా ఇండస్ట్రియల్ పార్క్.. యువతకు ఉపాధి కల్పన

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 04)

ఆంధ్రప్రదేశ్‌లో తయారయ్యే స్థానిక ఉత్పత్తులను ప్రపంచ స్థాయి బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్పత్తుల నాణ్యతను పెంచడంతో పాటు, వాటికి ప్రపంచ మార్కెట్ కల్పించేందుకు అవసరమైన పటిష్ఠమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో 'ప్రొడక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్ల' ఏర్పాటుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఈ క్లస్టర్లు చోదకశక్తులుగా మారాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక క్లస్టర్లకు సమగ్రమైన లాజిస్టిక్స్ కనెక్టివిటీని అందించడం అత్యంత కీలకమని సీఎం నొక్కిచెప్పారు. ఉత్పత్తుల తయారీ కేంద్రాలకు రోడ్డు, రైలు, పోర్టు మార్గాలను అనుసంధానం చేయడం ద్వారా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. రవాణా వ్యయం తగ్గితేనే ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్‌లో పోటీతత్వం పెరుగుతుందని, అంతిమంగా పరిశ్రమలకు, రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ఈ క్లస్టర్లకు నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సూచించారు. ▶మిగతా 2లో

# ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా శిఖకొల్లి వెంకట సత్యనారాయణ నియామకం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

ఆర్యవైశ్య మహాసభ చైర్మన్ టీజీ వెంకటేష్ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, పెనుగొండ సుబ్బరాయుడు, కాళ్ళకూరి నాగబాబు, మాటూరి రంగనాథ్, పల్లపోతు వెంకటేశ్వర్లు సలహాలతో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం 2026-28 ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా శిఖకొల్లి వెంకట సత్యనారాయణని నియమించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్క ఆర్యవైశ్య సభ్యులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య యువజన సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

# బిజెపి గెలుపు పై ఒంగోలులో నాయకులు సంబరాలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు సోమవారం రావడంతో ఎన్డీఏ, దాని మిత్రపక్ష పార్టీలు విజయ దుందుభి మోగించడంతో ఒంగోలులోని బిజెపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జి రమాదేవి ఆధ్వర్యంలో చర్చి సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. పశ్చిమ బెంగాల్లో 75 సంవత్సరాల తర్వాత బిజెపి కార్యకర్తల కళ సహకారమైందని, బెంగాల్లో ఇది చారిత్రాత్మక విజయం అన్నారు. ఈ కార్యక్రమంలో కాట రాధాకృష్ణ, కటారి సుధాకర్ యాదవ్, రాయల రామకృష్ణ, మోజేష్, ప్రదీప్, తదితరులు పాల్గొని మిఠాయిలు పంచుకున్నారు.

మొదటి పేజీ తరువాయి

## పార్టీ స్థాపించిన అనతి కాలంలోనే గొప్ప విజయం.. విజయ్‌పై పవన్ కల్యాణ్

ఇక తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మెజారిటీ స్థానాలను అందించి.. సింహభాగం ప్రజలు ఆయన వైపు మొగ్గు చూపారని పవన్ అన్నారు. పార్టీని స్థాపించిన అనతి కాలంలోనే గొప్ప విజయాన్ని సాధించిన విజయ్‌ని మనసారా అభినందించారు. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే, భాజపా కూటమి పోరాటం బలమైనదేనన్నారు.

## గత ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్ల అప్పు భారం మోపింది: నారాయణ

నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ తీరుపై మండిపడుతూ.. గత పాలకులు రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపడమే కాకుండా, పరిశ్రమలు తరలిపోయేలా చేశారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని విమర్శించిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని ధీమా వ్యక్తం చేశారు.

## విజయ్‌కి అభినందనలు.. దీదీకి సానుభూతి: ఎన్నికల ఫలితాలపై జగన్

అదే సమయంలో, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల సరళిని ఉద్దేశిస్తూ అక్కడి పరిణామాలపై కూడా జగన్ స్పందించారు. "దీదీకి నా సానుభూతి తెలియజేస్తున్నాను. గెలుపు బాటలో ఉన్న బీజేపీకి, ఇతరులకు అభినందనలు" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తాజా సమాచారం ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ 22 స్థానాల్లో గెలిచి 175 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, తమిళనాడులో విజయ్ పార్టీ 19 స్థానాల్లో నెగ్గి, మరో 88 స్థానాల్లో ముందుంజలో ఉంది. మొత్తమ్మీద విజయ్ పార్టీ తమిళనాడులో ప్రభంజనం సృష్టిస్తోంది.

## ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్..

సమీక్షలో భాగంగా విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వ 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) పథకం కింద చేపట్టనున్న పారిశ్రామిక, కెమికల్ పార్కుల అభివృద్ధిపై సీఎం అధికారులతో చర్చించారు. 2026-27 నాటికి ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్, ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌తో పాటు 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశంపై ప్రణాళికలను పరిశీలించారు. పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు గ్రామీణ ప్రాంతాలకు, రైతులకు కూడా అందాలని సీఎం ఆకాంక్షించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను భాగస్వామ్యం చేయడం ద్వారా రైతులు పండించిన పంటలకు మంచి ధర లభించేలా చూడాలన్నారు. 'పరిశ్రమలు-మౌలిక సదుపాయాలు-పర్యాటకం' అనే త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగాలని నిర్దేశించారు. ప్రతి జిల్లాలో ఒక మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు వాటికి అనుబంధంగా ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని చంద్రబాబు సూచించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించి, ఏపీని అగ్రస్థానంలో నిలపాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాభివృద్ధి జరగాలని, ఇందుకోసం యూనివర్సిటీల్లో హైబ్రీడ్ విధానంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టే ఆలోచన చేయాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కంగ్రాచ్యులేషన్స్ విజయ్

విజయ్ పార్టీ (టీవీకే) నమోదు చేస్తున్న అద్భుతమైన ఎన్నికల విజయాల పట్ల నా అభినందనలు. ఈ ఫలితాలు రాష్ట్ర ప్రజల మారుతున్న ఆకాంక్షలకు అద్దం పడుతున్నాయి. విజయ్ ఘనత తమిళనాడు రాజకీయ యవనికపై ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించింది" అని పేర్కొన్నారు. ప్రజా జీవితంలోకి అడుగుపెడుతున్న విజయ్‌కు శుభం కలగాలని లోకేశ్ ఆకాంక్షించారు. "ప్రజల అంచనాలను అందుకుంటూ, బాధ్యతతో, అంకితభావంతో విజయ్ పనిచేస్తారని ఆశిస్తున్నాను" అని లోకేశ్ తన సందేశంలో వివరించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు.

## తమిళనాడు ఓటర్లకు మోదీ కృతజ్ఞతలు.. విజయ్ పార్టీకి ప్రత్యేక అభినందనలు

సోమవారం సోషల్ మీడియా వేదికగా మోదీ ఒక సందేశం పోస్ట్ చేశారు. "తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు మద్దతు పలికిన ఓటర్లకు నా కృతజ్ఞతలు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో, వారి జీవితాలను మెరుగుపరచడంలో మేము ఎల్లప్పుడూ ముందుంటాం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. తమిళనాడు రాజకీయాల్లో దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల ఆధిపత్యం కొనసాగుతున్న తరుణంలో, టీవీకే అరంగేట్రంతోనే కీలక శక్తిగా అవతరించింది. ఈ నేపథ్యంలో విజయ్ పార్టీ ప్రదర్శనను ప్రధాని అభినందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. "టీవీకే అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. వారికి నా అభినందనలు" అని మోదీ తన సందేశంలో జోడించారు. తమిళనాడు అభివృద్ధికి, అక్కడి ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల వృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు మరింత మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. "తమిళనాడు పురోగతికి, ప్రజల శ్రేయస్సుకు కేంద్రం అన్ని విధాలా సహకరిస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో టీవీకే రూపంలో ఒక కొత్త రాజకీయ శక్తి ఎదుగుతున్న తరుణంలో, తమిళనాడుతో రాజకీయంగా, అభివృద్ధి పరంగా మరింత బలమైన సంబంధాన్ని కొనసాగించాలన్న ఎన్డీఏ ఉద్దేశాన్ని ప్రధాని సందేశం స్పష్టం చేస్తోంది.

# గొర్రె ముచ్చుకు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పించిన నీలం

### ఉద్యోగ ఉత్తర్వులు మంజూరు చేసిన కలెక్టర్ రాజాబాబు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

రెండేళ్ళుగా వెటర్నరీ, కలెక్టరేట్ అధికారుల కొర్రిల ను అధికమించి దళిత నేత నీలం చొరవ, కృషితో గొర్రె మచ్చు జగపతిబాబు కు వెటర్నరీ శాఖ నుండి రెవెన్యూలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం మంజూరైంది. ఈ ఉద్యోగ నియామక పత్రాన్ని కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో దళిత నేత నీలం సమక్షంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు గొర్రె మచ్చుకు అందజేశారు. పశు వైద్య ఆరోగ్యశాఖలో అటెండర్‌గా పనిచేస్తున్న గొర్రె ముచ్చు శ్రీను 2024వ సంవత్సరం మే 12వ తేదీన అనారోగ్యంతో చనిపోయాడు. కారుణ్య నియామకం క్రింద మరణించిన గొర్రె ముచ్చు శ్రీను కుటుంబానికి ఉద్యోగం ఇవ్వవలసి ఉంది. కానీ మృతుడు శ్రీనుకి ముగ్గురు కుమారులు ఉండటంతో ఉద్యోగం ఎవరు తీసుకోవాలనే నిర్ణయంలో విభేదాలు వచ్చి చట్ట ప్రకారం మరణించిన ప్రభుత్వ ఉద్యోగి కుటుంబంలో ఉద్యోగానికి సంవత్సరంలోపు అప్లికేషన్ పెట్టుకోవాల్సి ఉంటుంది. కుమారుల విభేదాలతో తీరా సంవత్సరం గడువుకు ఐదు రోజుల ముందు అప్లికేషన్ పెట్టుకున్నారు. వీరు పెట్టుకున్న అప్లికేషన్‌ను పశుసంవర్ధకశాఖ వారు కలెక్టరేచ్‌కు పంపే లోపు మరో 20 రోజులు అయ్యింది. సంవత్సరం గడువు ముగిసింది కాబట్టి ఉద్యోగం ఇవ్వటానికి వీలులేదని కలెక్టరేట్ వారు మరల సదరు ఉద్యోగ అభ్యర్థనను వెటర్నరీ శాఖకు వెనక్కి పంపారు. అప్పటి నుండి కలెక్టరేట్ వెటర్నరీశాఖలో పోటీపడి గొర్రె ముచ్చు కుటుంబానికి ఉద్యోగం ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఉద్యోగం రాదని కూడా చెప్పారు. అంతట గొర్రె ముచ్చు సోదరులు తమకు ఉద్యోగం ఇప్పించాలని కలెక్టరేట్ వారు కొర్రీలతో మమ్మల్ని వేధిస్తున్నారని చెప్పారు. అంతట జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసుని మార్చి నెలలో కలిసి గొర్రె ముచ్చు జగపతిబాబుకు ఇంటర్మీడియట్ చదువుకొని ఉన్నప్పటికీ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇవ్వాలని నీలం కోరారు. తరువాత ఏప్రిల్ నెలలో జిల్లా కలెక్టర్ రాజాబాబును కలిసి కలెక్టరేట్‌లో గొర్రె ముచ్చు ఉద్యోగం పెండింగ్ లో ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. ఎట్టకేలకు జిల్లా రెవిన్యూ అధికారి ఓబులేసు చరవతో నీలం నాగేంద్ర విజ్ఞప్తి మేరకు గొర్రె ముచ్చు జగపతిబాబుకు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం మంజూరు అయింది. రెండేళ్లుగా తండ్రిని కోల్పోయి ఉద్యోగం కోసం నిరీక్షిస్తున్న గొర్రె ముచ్చు కుటుంబానికి సోమవారం గ్రీవెన్స్ సెల్ లో దళిత నేత నీలం నాగేంద్రరావు సమక్షంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు ఉద్యోగ ఉత్తర్వులు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధారా అంజయ్య, కాకుమాను రవి, మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ అట్రా బంగారం, సమతాదళ్ కన్వీనర్ మేడికొండ మురళి, తదితరులు వున్నారు.

# ఘనంగా ముత్యాల పాటి జశ్విత ఓణీల వేడుక



(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, మే 4)


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు చిట్యం శెట్టి వెంకట కృష్ణారావు ముత్యాలపాటి కార్తీక్ రేణుకా దేవిల ఏకైక పుత్రిక జశ్విత ఓణీల వేడుక మండలంలోని జి అగ్రహారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, పొదిలి యూనిట్ ప్రధాన కార్యదర్శి దాసరి గురుస్వామి పాల్గొని చిరంజీవి జస్వితను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు చిట్టెంశెట్టి పెద్ద సుబ్బారావు, చిన్న సుబ్బారావు, ప్రభాకర్, శ్రీనివాసులు, శివయ్య, దుడ్డు హరి, శంకర్, శ్రీనివాస్, నలబోలు శివ కోటేశ్వరరావు, వరికుంట్ల వెంకటేశ్వర్లు, బూదాటి నిమ్మయ్య, సత్యం, అనూష, హారిక, ఫణిమాధవి, బంధుమిత్రులు కుటుంబ సమేతంగా హాజరై చిరంజీవి జశ్విత నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు.

# ప్రజా ఫిర్యాదుల పై త్వరితగతిన విచారణ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 4)



ప్రజా ఫిర్యాదులపై త్వరితగతిన విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో "మీకోసం" కార్యక్రమాన్ని మార్కాపురం జిల్లా పోలీసులు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు 33 ఫిర్యాదులు అందాయి. ప్రజా ఫిర్యాదులను తక్షణ పరిష్కారం అందించాలనే లక్ష్యంగా మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, పోలీస్ అధికారులు సోమవారం మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో "మీకోసం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ సమస్యలకు సంబంధించిన వ్రాతపూర్వక అర్జీలను పోలీస్ అధికారులకు సమర్పించారు. వారు తమ సమస్యలను వివరంగా తెలియజేశారు. పోలీస్ అధికారులు ఫిర్యాదుదారులతో ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యల నేపథ్యాన్ని తెలుసుకున్నారు మరియు వాటిని చట్టపరంగా త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే అందిన ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు పంపించి, చట్టం ప్రకారం వేగంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్-డివిజన్ కార్యాలయాల్లో కూడా అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్, అత్తరింటి వేదింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మార్కాపురం, త్రిపురాంతకం, పామూరు సిఐలు అల్తాఫ్ హుస్సేన్, అస్సన్, వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక
05.05.26    మంగళవారం


# ఉజ్వల భవిష్యత్తుకు ఊపిరి పోసే.. మన సంక్షేమ హాస్టళ్లు !



### ప్రకాశం, మార్కాపురం జిల్లాల విద్యార్థులకు సువర్ణావకాశం
### ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ప్రవేశాలు ప్రారంభం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)**

ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు నేడు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నాయి. పేద విద్యార్థుల కలలకు కార్పొరేట్ స్థాయి వసతుల దన్నునిస్తూ, వీటిని కేవలం వసతి కేంద్రాలుగానే కాకుండా ప్రతిభను వెలికితీసే 'ప్రగతి నిలయాలు' గా తీర్చిదిద్దామని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్ తెలిపారు. వీటిల్లోకి ప్రవేశాలను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదని, ప్రభుత్వ వసతులతో ఉన్నతమైన లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు లక్ష్మానాయక్ పిలుపునిచ్చారు.

**అత్యుత్తమ ఉత్తీర్ణత :** సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులు ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో సాధించిన అద్భుత ప్రగతే వీటిల్లోని విద్యా ప్రమాణాలకు నిదర్శనం. మొత్తం 936 మంది హాజరుకాగా 88% మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లాల్లోని 23 హాస్టళ్లు 100% ఉత్తీర్ణత సాధించాయి. అత్యధికంగా 583 మార్కులతో ప్రభంజనం. తాజా ఫలితాలలో 550 పైగా మార్కులు 58 మందికి, 500-549 మధ్య 137 మందికి లభించాయి. ఏకంగా 772 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు.

**కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు :** వసతులు – నవీకరించబడిన భవనాలు ప్లాంట్ల ద్వారా శుభ్రమైన త్రాగునీరు, సిసి కెమెరాల నిఘాలో పూర్తి భద్రత.

పౌష్టికాహారం : వారానికి మూడు సార్లు చికెన్, ఆరు రోజులు గుడ్లు, పండ్లు, చిక్కీలు మరియు రాగి జావతో కూడిన బలవర్ధకమైన ఆహారం. ఉచిత సామాగ్రి : బెడ్ షీట్లు, ట్రంక్ బాక్సులు, నోట్ బుక్స్, స్వెటర్లు, టవల్స్, ప్లేట్, గ్లాస్ ఉచితంగా అందజేయబడతాయి.

**స్టడీ మెటీరియల్ :** 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేయబడుతుంది.

ప్రవేశాల వివరాలు

అర్హత : 3వ తరగతి నుండి పీజీ వరకు చదువుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు విధానం : మీ గ్రామంలోని సచివాలయ వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ద్వారా, లేదా నేరుగా దగ్గరలోని హాస్టల్ వార్డెన్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

## 6న ఒంగోలు పార్లమెంటు టిడిపి కార్యాలయ నూతన భవనానికి శంకుస్థాపన




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)**

ఈ నెల 6వ తేదీ బుధవారం సోమవారం ఒంగోలు భాగ్యనగర్ నాలుగో లైన్ లోని ఏసీబీ కార్యాలయం సమీపంలో ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యాలయం నూతన భవనానికి శంకుస్థాపన కార్యక్రమం ఉదయం 10.31 గంటలకు జరుగుతుందని ఒంగోలు పార్లమెంటు టిడిపి పార్టీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఏపి మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య తెలిపారు. సోమవారం రాంనగర్ 2వ లైన్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వివిధ పదవుల్లో ఉన్న పార్టీ నాయకులు అందరూ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గ్రామ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు, కుటుంబ సాధికార సభ్యులు, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ పార్లమెంటు అధ్యక్షులు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో నూతన పార్టీ కార్యాలయ భవనానికి శంకుస్థాపన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా నుండి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో ఒంగోలు పార్లమెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు షేక్ ఆరీఫా, కార్యనిర్వాహక కార్యదర్శులు గార్లపాటి శ్రీనివాసరావు, కసుకుర్తి అంకరాజు, కార్యదర్శి తంజావూరి శ్రీనివాసమూర్తి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన కందుల వసంతలక్ష్మి

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, మే 4)

ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి లబ్దిదారులకు రిలీఫ్ ఫండ్ చెక్కులను ఇంటింటికి లబ్దిదారుల నివాస గృహాలకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె వారి ఆరోగ్య క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మీకు ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కలవాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ఏడు మందికి సీఎం సహాయనిధి చెక్కులు అందించారు. సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు



## పర్చూరులో 7 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం ఎమ్మెల్యే ఏలూరి కృషికి ఫలితం



### నెలకు రూ.10 వేల చొప్పున సాయం

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మే 4)

నియోజకవర్గంలోని చిన్న దేవాలయాలకు ఊరట లభించింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషి ఫలితంగా ఏడు దేవాలయాలు ధూపదీప నైవేద్య పథకంలో చోటు దక్కించుకున్నాయి. ఈ మేరకు ఎండోమెంట్స్ శాఖ కమిషనర్ కె రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. మే 1, 2026 నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. పథకం కింద ఎంపికైన ప్రతి దేవాలయానికి నెలకు రూ.10,000 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నారు. సీజీఎఫ్ కమిటీ ఆమోదంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక ప్రకటనలో వెల్లడించారు. ఈ పథకంలో పర్చూరు మండలం గొల్లపూడి శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం, యద్దనపూడి మండలం పోలూరు ఆరేటమ్మ తల్లి దేవస్థానం, చింతపల్లి పాడు శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానం, అదే గ్రామంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం, పెద్ద జాగర్లమూడి శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం, పర్చూరు ఏదుబాడు గ్రామంలోని పోలేరమ్మ తల్లి దేవస్థానం, శ్రీ గంగా బాల త్రిపుర సుందరి సమేత ఉమామహేశ్వర స్వామి ఆలయం చోటు దక్కించుకున్నాయి. (తరువాయి 4లో...)



## పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం పనికిరాదు

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 4)**


ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కార విషయంలో నిర్లక్ష్యం పనికి రాదని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ లో వచ్చే అర్జీల పరిష్కార శాతం చాలా తక్కువ గా ఉండదని వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా వీఆర్వోల పరిధిలో వారికి ఇచ్చిన సమయం లోనే సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాల న్నారు. 22ఏ, ఇతరులు వంటి భూ సమస్యల పై దృష్టి పెట్టాలన్నారు. యోగా కార్యక్రమాలకు సంబంధించి అధికారులందరూ లింకును ఓపెన్ చేసుకొని, ప్రజలను సైతం దీనిలో భాగస్వామ్యం చేయాలని కోరారు. ప్రస్తుత వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు త్రాగు నీటి (తరువాయి 4లో...)

## హెచ్చరికను లెక్కచేయని అధికారులు కూలిన విద్యుత్ స్తంభం

### తృటిలో తప్పిన పెనుప్రమాదం
### ప్రాణాలు పోయి ఉంటే బాధ్యత ఎవరిది?
### విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం

**(షణ్ముఖ వెలుగు, కంభం, మే 4)**

కంభం పట్టణంలోని అర్బన్ కాలనీలో ప్రమాదానికి గురయ్యే స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభంపై ముందుగానే పత్రిక ద్వారా స్థానిక ప్రజల ద్వారా హెచ్చరికలు ఉన్నప్పటికీ, విద్యుత్ శాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించారు. స్థానికంగా సమస్యను పలు మార్లు తెలియజేసినా, పత్రికలో ప్రచురించినా అధికారులు స్పందించలేదు. చివరకు ఈ రోజు ఆ స్తంభం కూలిపోయిన తర్వాతే విషయం గమనించాల్సి వచ్చింది. అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం జరగలేదు. ప్రాణనష్టం తప్పింది. అయితే ఇదే సంఘటనలో ఎవరైనా ప్రాణాలు కోల్పోయి ఉంటే బాధ్యత తీసుకునేది ఎవరు? ఈ నిర్లక్ష్యానికి సమాధానం చెప్పేది ఎవరు? అని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ముందస్తు చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జరిగిన తర్వాత కాదు జరగకముందే చర్యలు తీసుకోవాలి ఇది అధికారుల బాధ్యత అని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి మరమ్మతులు చేసి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకువాలని ప్రజలు కోరుతున్నారు.






## న్యాయం చేయాలని మొరపెట్టుకున్న నిర్వాసితులు



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మే 4)
వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభించి 30 సంవత్సరాలు అవుతుంది. ప్రాజెక్టు కోసం స్థలాలు భూములు ఇచ్చిన ముంపు గ్రామస్థులు మౌలిక వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు నిజమైన నిర్వాసితులకు అన్యాయం జరిగిందని మార్కాపురం కలెక్టర్ కార్యాలయంలో పెద్దారవీడు మండలం సుంకేసుల గ్రామం నిర్వాసితులు మొరపెట్టుకున్నారు. తమకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని ఏడుకొండలు, రంగయ్య విజ్ఞప్తి చేశారు.

## అగ్ని ప్రమాదంలో లారీ దగ్ధం మంటలను అదుపు చేసిన ఫైర్ అధికారులు



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, మే 4)
మండలంలోని రాచపూడి, దుద్దుకూరు మధ్యలో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విజయవాడ నుంచి గుడ్లూరు బొగ్గులోడుతో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు మంటల్లో దగ్ధమైంది. పక్కనే గడ్డి తగలబడి ఉండటంతో డ్రైవర్ గమనించక లారీని ఆపడంతో మంటలు చెలరేగాయని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న కొరిశపాడు ఏఎస్ఐ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలాన్ని చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. లారీ డ్రైవర్ నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలాన్ని చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే లారీ కొంత భాగం అగ్నికి ఆహుతి అయింది. పోలీసులు ఈ సంఘటనపై విచారణ చేపట్టారు.

## పావులూరులో వైభవంగా అంకమ్మ దేవర కొలుపులు హాజరైన గాదె మధుసూదన్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, మే 4)
ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో సింహాద్రి వారి వంశీయుల ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ అంకమ్మ దేవర కొలుపులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామానికి చేరుకున్న మధుసూదన్ రెడ్డి గారికి గ్రామస్థులు, పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించాలని, అందరూ ఆయురారోగ్యాలతో వుండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా కార్యదర్శి పులకండం రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లా రైతు విభాగం సెక్రెటరీ సింహాద్రి బ్రహ్మారెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ కన్వీనర్ సింహాద్రి సుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు తాడిపర్తి చంద్రారెడ్డి, పులకండం జయరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన కందుల వసంతలక్ష్మి



అందుకున్న వారిలో రెబ్బ నందు వర్ధన్ (బసవాపురం) రూ.27,144, బోరిగొర్ల ఆదినారాయణ (గణివానిపాడు) రూ.37,292, చిరుగూరి లక్ష్మయ్య (గొట్లగట్టు) రూ.18,819, మెట్టు రామకృష్ణారెడ్డి (కొనకనమిట్ల) రూ.20,284, బేబీ ఆఫ్ ఉప్పతి ఆదిలక్ష్మి (నాగరాజుకుంట) రూ.35,917, యానం చిన్న రోషిరెడ్డి (నాగరాజు కుంట) రూ.36,084, దార్ల బాల చెన్న కృష్ణయ్య (పెదారికట్ల)కి రూ.25,543 రూపాయల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వెలిగొండ స్వామి దేవస్థాన అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కుందురు కాశిరెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం పనికిరాదు



సమస్యలు తలెత్త కుండా చర్యలు తీసుకోవాల న్నారు. అదేవిధంగా పారిశుద్ధ్యనికి సంబంధించి మురికి కాలువల ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 169 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూకు సంబంధించిన 108, ఇతర సమస్యలపై 61 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, మార్కాపురం, కనిగిరి ఆర్డీవోలు ప్రభాకర్, వెంకట శివరామిరెడ్డి, జిల్లా గనుల శాఖ అధికారి రవి ప్రసాద్, జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు, గృహ నిర్మాణ శాఖ పీడీ మోహన్‌రావు, ఎక్సైజ్ ఈఎస్ బాలయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పర్చూరులో 7 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం

### ఎమ్మెల్యే ఏలూరి కృషికి ఫలితం

ఈ ఆర్థిక సాయం ద్వారా దేవాలయాల్లో నిత్య పూజలు, ధూపదీప నైవేద్యాలు నిరంతరంగా నిర్వహించేందుకు సౌలభ్యం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. చిన్న దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# పంచెకట్టులో ప్రధాని మోదీ... ఎన్నికల ఫలితాల్లో బీజేపీ హవాపై కీలక ప్రసంగం

బెంగాల్ విజయంతో శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆత్మ శాంతించి ఉంటుందన్న మోదీ
భయం నీడ నుంచి బెంగాల్ విముక్తి పొందిందని వెల్లడి
ఈసారి శాంతియుత ఓటింగ్ జరిగిందని వ్యాఖ్య
కాంగ్రెస్ పార్టీ 'అర్బన్ నక్సల్స్' ముఠాలా మారిందని తీవ్ర స్థాయిలో విమర్శలు
గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు బీజేపీ అధికారంలో ఉందని గుర్తు చేసిన మోదీ
తూర్పు భారత పునరుజ్జీవంతోనే 'వికసిత్ భారత్' సాధ్యమని స్పష్టం



పశ్చిమ బెంగాల్ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రదర్శించిన అద్భుతమైన పనితీరుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. బెంగాల్‌లో పార్టీకి లభించిన అపూర్వ విజయం వల్ల, ఆ రాష్ట్రాన్ని భారత్‌లో అంతర్భాగంగా ఉంచేందుకు పోరాడిన డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆత్మకు ఎంతో శాంతి చేకూరి ఉంటుందని ఆయన భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. సోమవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విజయోత్సవ సభలో ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఆయన పంచెకట్టులో రావడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

**శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆత్మ శాంతించి ఉంటుంది**

ప్రధాని మోదీ తన ప్రసంగంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలను గుర్తు చేసుకున్నారు. "దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు ముఖర్జీ ఒక గొప్ప యుద్ధమే చేశారు. ఈ రోజు బెంగాల్ ఫలితాలతో ఆయన ఆత్మ ఎంతో శాంతించి ఉంటుంది. 1951లో భారతీయ జనసంఘ్ (బీజేపీకి పూర్వ రూపం) స్థాపించి, దేశం కోసం జీవించాలి, దేశం కోసం మరణించాలి అనే సందేశాన్ని ప్రతి కార్యకర్తకు ఇచ్చారు. దేశమే ప్రథమం అనే మంత్రాన్ని అనుసరించేవారు ప్రాణత్యాగానికి కూడా వెనుకాడరని తన జీవితం ద్వారా నిరూపించారు" అని మోదీ కొనియాడారు. బెంగాల్ ప్రజలు దశాబ్దాల భయం నీడ నుంచి విముక్తి పొందేందుకు బీజేపీకి అవకాశమిచ్చారని, వారికి సుపరిపాలన అందిస్తామని హామీ ఇచ్చారు.

**భయం, హింస నుంచి విముక్తి**

బెంగాల్ రాజకీయ సంస్కృతిలో మార్పు రావాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అన్నారు. "గతంలో బెంగాల్ ఎన్నికలంటే హింస, భయానక వాతావరణం, అమాయకుల మరణాలు అనే వార్తలు వచ్చేవి. కానీ ఈసారి ప్రశాంతంగా ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ఒక్క ప్రాణం కూడా పోలేదు. ప్రజాస్వామ్య పండుగలో ప్రజల గొంతు వినిపించింది. తొలిసారిగా భయంపై ప్రజాస్వామ్యం గెలిచింది" అని ఆయన పేర్కొన్నారు. ఇకపై బెంగాల్‌లో హింస, ప్రతీకార రాజకీయాలకు స్వస్తి పలికి, శాంతియుత వాతావరణంలో అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్ని పార్టీలకు ఆయన పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ ఒక 'అర్బన్ నక్సల్స్' ముఠా**

ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై, ముఖ్యంగా కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "నారీ శక్తి వందన్ అధినియం"ను వ్యతిరేకించిన కాంగ్రెస్, డీఎంకేలను మహిళా ఓటర్లు శిక్షించారని అన్నారు.

"అడవుల్లో అంతరించిపోతున్న మావోయిజం ఇప్పుడు కాంగ్రెస్‌లో పాతుకుపోయింది. ఆ పార్టీ 'అర్బన్ నక్సల్స్' ముఠాలా మారింది. ప్రపంచం తిరస్కరించిన కమ్యూనిజం భావజాలంతో కాంగ్రెస్ చేతులు కలుపుతోంది" అని సంచలన ఆరోపణలు చేశారు. దేశ సంస్కృతి, ఆకాంక్షలను అర్థం చేసుకోలేక కాంగ్రెస్ రోజురోజుకూ కుంచించుకుపోతోందని విమర్శించారు. సమాజ్‌వాదీ పార్టీ కూడా మహిళా వ్యతిరేక విధానాల వల్ల వారి ఆగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

**గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు కమలం**

తన ప్రసంగంలో ప్రధాని మోదీ గంగా నదితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు గంగా నది ప్రవహించే అన్ని రాష్ట్రాల్లో (ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్) ఇప్పుడు బీజేపీ-ఎన్డీయే అధికారంలో ఉండటం గర్వకారణమని అన్నారు. 2014లో కాశీలో నామినేషన్ వేసేందుకు వెళ్లినప్పుడు, "నన్ను ఎవరూ పిలవలేదు, నన్ను ఎవరూ పంపలేదు... సాక్షాత్తు గంగా మాతే నన్ను పిలిచింది" అని చెప్పిన మాటలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు గంగా మాత ఆశీస్సులు పార్టీపై ఉన్నాయని, అదే అనుభూతి కలుగుతోందని తెలిపారు.

**తూర్పు భారత పునరుజ్జీవంతోనే 'వికసిత్ భారత్'**

"వికసిత్ భారత్ ఏ2047" లక్ష్య సాధనలో తూర్పు భారతదేశం పాత్ర అత్యంత కీలకమని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. "పాత రోజుల్లో అప్పటి బీహార్, బెంగాల్, ఒడిశా భారత గొప్పతనానికి మూడు స్తంభాలుగా ఉండేవి. కళింగ (ఒడిశా) సముద్ర వాణిజ్యంలో, అంగ (బీహార్) పత్తి, పట్టు వ్యాపారంలో, బంగ (బెంగాల్) సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లాయి. వికసిత్ భారత్ సాధించాలంటే ఈ మూడు స్తంభాలను పునరుజ్జీవింపజేయాలి. ఈ మూడు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పయనించేందుకు బీజేపీపై విశ్వాసం ఉంచడం సంతోషంగా ఉంది" అని ఆయన అన్నారు.

విజయం సాధించిన ఇతర పార్టీలకు అభినందనలు తెలుపుతూ, కేంద్ర ప్రభుత్వం వారికి పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

# ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

ప్రజలు నుండి అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖలు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, వారికి సంతృప్తి కలిగే విధంగా నిర్ణీత గడువులోగా సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఇంచార్జి జిల్లా రెవెన్యు అధికారి మాధురి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి, డిపిఓ వెంకటేశ్వరరావులతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు నుండి అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరం పరిష్కరించడంతో పాటు అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం ఉండాలన్నారు. ఏదైనా కారణంగా ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే, దానికి గల కారణాలను అర్జీదారునికి అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంటు ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపకూడదన్నారు. సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో మొత్తం 186 వినతులు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కూచిపూడి నాట్య ప్రదర్శనలో శ్రీ నటరాజ కూచిపూడి నాట్యాలయం చిన్నారుల ప్రతిభ

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 4)

కూచిపూడి నాట్య గురువు కే లక్ష్మి శిక్షణలో తక్కువ సమయంలో కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించి అందరి ప్రశంసలు పొందారు పొదిలికి చెందిన శ్రీ నటరాజ కూచిపూడి నాట్యాలయం చిన్నారులు. మొట్టమొదటి సారిగా శ్రీశైల దేవస్థానం ఆస్థాన మండపంలో ఆ పరమేశ్వరుని సన్నిధిలో గజ్జ కట్టి కదం తొక్కారు. నాట్య గురువు కే లక్ష్మి ప్రత్యేక శిక్షణ చిన్నారులను తక్కువ సమయంలో వేదిక పై ప్రదర్శించే అవకాశం కలిగింది. నటరాజ కూచిపూడి నాట్యాలయం పొదిలికి చెందిన చిన్నారులు శ్రీశైల దేవస్థానంలో చక్కటి ప్రతిభను కనబరిచారు. శ్రీశైల దేవస్థానంలో నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా శ్రీ నటరాజ కూచిపూడి నాట్యలయం పొదిలి కి చెందిన చిన్నారులు కూచిపూడి ప్రదర్శన చేశారు. నాటి గురువు కే లక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆదరించాయి. గరుడ గమన, పుష్పాంజలి, పౌర్ణమి అలాగే సంయుక్త హస్తాలు, శ్లోకాలు వేదిక పై పట్టించారు. శ్రీశైల దేవస్థానంలో ఇంతటి అవకాశం మాకు రావడం చాలా సంతోషమని నాట్య గురువు కే లక్ష్మి అన్నారు. పొదిలికి చెందిన శ్రీ వాత్సల్య, పి చార్వి శ్రీ, బి హనాన్యరెడ్డి, అన్విక రెడ్డి, హీరా మీనన్. దీక్షిత, టి యశస్విలు పాల్గొన్నారు. తమకు ఇంతటి అవకాశాన్ని కల్పించిన దేవాలయ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కూచిపూడి నాట్యాన్ని పలువురు తిలకించారు. కళావేదిక పై జరిగిన కూచిపూడి నాట్య వైభవం అందర్నీ అలరించింది. కూచిపూడి నాట్యాన్ని ప్రోత్సహించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. శ్రీశైల దేవస్థానంలో కళలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. చిన్నారులకు వసతి గదులు, భోజన వసతి ఏర్పాటు చేయడంతో పాటు దైవదర్శనం కూడా కల్పించారని అన్నారు.





# ప్రజా ఫిర్యాదులను పరిష్కరించే లక్ష్యంతో మీకోసం

## ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 49 ఫిర్యాదులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)




జిల్లా ప్రజల నుంచి వచ్చే పలు రకాల ఫిర్యాదులను పరిష్కారించి బాధితులకు న్యాయం అందించాలనే లక్ష్యంతో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు, పోలీస్ అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (మీకోసం)ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలకు సంబంధించిన వ్రాతపూర్వక అర్జీలను స్వేచ్ఛాయుత వాతావరణంలో జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులకు తెలిపారు. జిల్లా ఎస్పీ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యల వివరాలను తెలుసుకొని, వాటిని చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అందిన ఫిర్యాదుల పై జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ప్రతి ఫిర్యాదు పై తక్షణ విచారణ చేపట్టి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం కల్పించాలని ఆదేశించారు. "మీకోసం" కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల పై ఎలాంటి అలసత్వం చూపకుండా, నిర్ణీత గడువులోనే పరిష్కారం అందించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వృద్ధులు, నడవలేని పరిస్థితిలో ఉన్నవారి సమస్యలను ప్రత్యేకంగా పరిశీలనలోకి తీసుకొని, సంఘటన స్థలాలను సందర్శించి చట్టప్రకారం సత్వర న్యాయం అందించాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో కూడా అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్, అత్తరింటి వేదింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఒంగోలు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, కొండేపి సీఐ రమణయ్య, దర్శి సీఐ రామారావు, ప్యానెల్ అడ్వొకేట్ బి బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ జనార్దన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.




# వెల్లలచెరువులో వైయస్సార్ విగ్రహం ధ్వంసం తగదు



(షణ్ముఖ వెలుగు, సంతమాగులూరు, మే 4)

మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయటం తగదని వైసిపి నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు గోలి రమణబాబు తెలిపారు. గ్రామాలలో విద్వేషాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని ఆయన సూచించారు. మండల వైసిపి యువజన విభాగ అధ్యక్షులు నూక తోటి అశోక్ మాట్లాడుతూ తెలుగు రాజకీయాలలో అందరికీ గుర్తు వచ్చే నాయకుడు ఎన్టీఆర్, వైయస్సార్ అని అన్నారు. అలాంటి మహానేత వైయస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయటం తగదని ఆయన చెప్పారు. పల్లెలు ప్రశాంత వాతావరణంలో ఉండాలని ఇలాంటి రాజకీయ విద్వేషాలకు పాల్పడకూడదని అశోక్ హితవు పలికారు.

# రెవెన్యూ క్లినిక్‌కు మూడు అర్జీలు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 4)

రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరిం చేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అను సంధానంగా రెవెన్యూ క్లినిక్ కు ముడు అర్జీలు వచ్చినట్లు మండల తహశీల్దార్ జే ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ జే ప్రభాకరరావు అధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ నందు సర్వే నిమిత్తం అర్జీలు స్వీకారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె ధనలక్ష్మి, ఎపిఎం సుబ్బారావు, మండల సర్వేయర్ సజ్జ లోకేష్, ఏవో చంద్రశేఖర్, హౌసింగ్, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

# ముందస్తు పన్నుతో 'రిబేటు' వెసులుబాటు

## 'మెగా టాక్స్ మేళా' పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ పి రాజా బాబు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 4)

గ్రామ పంచాయతీల ఆర్థిక పురోభివృద్ధికి ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నుల మెగా టాక్స్ మేళా' గోడపత్రికను (పోస్టర్) ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూళ్ల ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందస్తుగా పన్ను చెల్లించే వారికి ప్రత్యేక రాయితీలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. "మే 31వ తేదీలోపు 2026-27 సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ (రిబేటు) లభిస్తుంది. జిల్లాలోని గృహ యజమానులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ వంటి పనులు పంచాయతీల ఆదాయంపైనే ఆధారపడి ఉంటాయని, ప్రజలు తమ వంతు బాధ్యతగా పన్నులు చెల్లించి గ్రామ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పన కుమారి, జిల్లా పంచాయతీ అధికారి యం వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు. మే నెలాఖరు వరకు నిర్వహించే ఈ మేళా పై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# గిద్దలూరు నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్ గా షేక్ ఖాసిం షరీఫ్ నియామకం



(షణ్ముఖ వెలుగు, కంభం, మే 4)

మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గ మైనార్టీ డిపార్ట్‌మెంట్ సెల్ చైర్మన్‌గా మార్కాపురం జిల్లా కంభం పట్టణానికి చెందిన షేక్ ఖాసిం షరీఫ్ ని నియమించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి మార్కాపురంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహబూబ్ వలి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, మైనార్టీల సంక్షేమానికి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఖాసిం షరీఫ్ కి హార్ధిక శుభాకాంక్షలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, కాంగ్రెస్ పార్టీకి ప్రజల ఆదరణ ఇవన్నీ నేను కాంగ్రెస్ పార్టీలోకి చేరడానికి కారణమని అలాగే ముఖ్యంగా కుల మత బేధాలు లేకుండా తన మన తారతమ్యాలు లేకుండా తప్పు చేసిన వాడు స్నేహితుడు అయినా బంధువు అయినా చివరికి రక్తసంబంధం కలిగిన వారైనా తప్పు చేసిన వాళ్ళని నిలదీసే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకురాలు షర్మిల గారి నాయకత్వంలో కలిసి పనిచేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని నాపై నమ్మకంతో నాకు ఇచ్చిన ఈ భాధ్యతను క్రమశిక్షణతో పనిచేస్తూ పార్టీకి మంచి పేరు తీసుకొస్తానని ఖాసీం షరీఫ్ ఈ సందర్భంగా తెలిపారు. నాకు ఈ భాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర, జిల్లా నాయకులకు ఉమ్మడి ప్రకాశంజిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ మహబూబ్ వలికి కృతజ్ఞతలు తెలిపారు.

# శక్తి సదన్‌ను సందర్శించిన జేసీ







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

హౌసింగ్‌బోర్డ్ లో ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి చేత నిర్వహించబడుతున్న నిరాశ్రయ మహిళా ఆశ్రమం అనగా శక్తి సదన్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగమణి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మహిళా ఆశ్రమంలోని నివాసితులను కలుసుకొని వారితో మాట్లాడి వారి సమస్యల గురించి తెలుసుకున్నారు .అలాగే మేనేజ్మెంట్ బాధ్యులైన సంస్థ అధ్యక్షులు తేళ్ల అరుణ, బీరం అరుణలతో కూడా హోంకు ఉన్న పరిస్థితుల గురించి చర్చించారు. అప్పటికప్పుడే స్థానిక ఎమ్మార్వోని ఇంకా ఇతర ఉద్యోగస్తులను, గ్యాస్ ఏజెన్సీస్ వారిని పిలిపించి హోమ్‌కున్నటువంటి సమస్యలను పరిష్కరించారు. ఆమె హోమ్‌లోని స్త్రీలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆత్మ న్యూనతతో ఉండవద్దన్నారు. మీరు తీసుకున్న నిర్ణయాలు సరైనవే అనే ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఇప్పుడున్న వ్యవస్థని జయించేందుకు మీరు మంచి మార్గాన్ని ఎంచుకోవాలని ఆమె సూచించారు. ఒక్కొక్కరితో వ్యక్తిగతంగా కూడా మాట్లాడారు. హోం నిర్వాహకులైన తేళ్ల అరుణ, బీరం అరుణ లను ఆమె అభినందించారు. ఆశ్రమంలోని మహిళలలో జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి చాలా ఉత్సాహాన్ని నింపారు.

# పాలేటి గంగమ్మ తల్లి తిరునాళ్ళకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు**
**దేవాలయము వద్ద భద్రతా ఏర్పాట్లను**
**స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ**
**తిరునాళ్ళు సమయంలో దొంగతనాలు,**
**అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా**
**ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళికాబద్ధమైన ఏర్పాట్లు**





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 4)

పెద్ద చెర్లోపల్లి మండలం, పెద అలవలపాడు పంచాయతీలోని వెంగళాపురం గ్రామంలో ఈ నెల 5వ తేదీ మంగళవారం శ్రీ పాలేటి గంగమ్మ తల్లి తిరునాళ్ళ నేపథ్యంలో సోమవారం మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. దేవాలయ ప్రాంగణ పరిసరాలు, ప్రవేశ మార్గములు, క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలు, ప్రభలు ఉంచే ప్రదేశాలు, ఎద్దుల పందాలు జరిగే ప్రదేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు,ఎగ్జిబిషన్ జరిగే ప్రదేశాల వద్ద భద్రతా మరియు బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఆలయాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధమైన క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలని, తిరునాళ్ళు ప్రశాంత వాతావరంలో జరిగేలా దేవాదాయ, రెవిన్యూ అధికారుల సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ తిరునాళ్ళు ప్రశాంతంగా నిర్వహించేందుకు సిబ్బందితో పకడ్బందీగా భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, పూర్తి స్థాయి బందోబస్తుతో అప్రమత్తంగా ఉంటూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడుతామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భద్రతా చర్యలపై పోలీసు అధికారులు మరియు ఆలయ పెద్దలతో మాట్లాడమని, తిరునాళ్ళు జరిగే ప్రాంతంలో దొంగతనలు, అసాంఘిక చర్యలకు తావు లేకుండా ప్రత్యేక నిఘా, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో కూడా నిఘా ఉంచామని, ప్రత్యేక కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశామని, ఏదైనా అవాంఛనీయ సంఘటనల గురించి వెంటనే సమాచారం డయల్ 112 తెలియచేయాలన్నారు. భక్తులు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు గురించి, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ఎక్కడ ఎలాంటి అనుకోని సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు. భక్తులు, ప్రజలు తోపులాటలు లేకుండా తిరునాళ్ళు ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. అనంతరం ఎస్పీ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ వెంట ఎస్‌బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, కనిగిరి సీఐ యు శ్రీనివాసులు, పీసీ పల్లి ఎస్ఐ నరసింహారావు, కనిగిరి ఎస్ఐ సందీప్, హెచ్‌ఎంపాడు ఎస్ఐ రాజ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.



# ఆకివీడులో నిర్బంధాన్ని తక్షణం ఆపాలి ఘటన పై న్యాయ విచారణ జరపాలి

## కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ డిమాండ్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)

పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెదపేటలో దళితులపై కొనసాగుతున్న నిర్బంధాన్ని తక్షణమే ఆపాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ డిమాండ్ చేశారు. ఆకివీడులో గొంతేనమ్మ గుడి కూల్చివేత, దళితవాడపై పోలీసుల నిర్బంధం, అక్రమ అరెస్టులకు నిరసనగా ఒంగోలులో గాంధీ నగర్ సెంటర్‌లో కెవిపిఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ ఆకివీడులోని గొంతేనమ్మ విగ్రహాన్ని అర్ధరాత్రి అక్రమంగా కూల్చివేయడం తీవ్రంగా ఖండనీయమన్నారు. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ ఒత్తిళ్లకు లోనై ప్రభుత్వం తప్పుడు నివేదికలు ఇచ్చిందని ఆరోపించారు. గతంలో మసీదులు, చర్చిలపై దాడులు చేసిన మతోన్మాద శక్తులు ఇప్పుడు గుళ్లపై కూడా దాడులు చేయడం ప్రమాదకర పరిణామమన్నారు. దళితవాడలో ఉన్న గొంతేనమ్మ గుడిని ఆధునీకరించి పునర్నిర్మాణం చేయాలని స్థానిక దళితులు కోరుతున్నా వారి అభిప్రాయాలను పట్టించుకోకుండా అర్ధరాత్రి గుడిని కూల్చివేయడం అన్యాయమన్నారు. శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు సారథ్యంలో ఈ చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు. గుడి కూల్చివేత సమయంలో పోలీసులను ఇంటింటికి కాపలా పెట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. కోర్టులో కేసు విచారణ జరుగుతుండగానే గుడిని కూల్చి నిర్మాణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. వివాదాస్పద స్థలాల్లో ఉన్న మత నిర్మాణాలను కూల్చరాదని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించడం సరైనది కాదని అన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించిన రఘురామ్ ప్రశ్నించారు, ప్రభుత్వం ఈ ఘటనపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. దళితవాడలో బయట శక్తులు భయాందోళనలు సృష్టిస్తుంటే ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దళిత సంఘాల కార్యకర్తలను అడ్డుకోవడం, అరెస్టులు చేయడం, భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడం అనేది ప్రజాస్వామ్యానికి విఘాతం అన్నారు. భీమవరం డిఎస్పి సోషల్ మీడియా ద్వారా బెదిరింపులకు దిగడం ఖండిస్తునట్లు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి న్యాయ విచారణ జరిపి నిజాలను వెలుగులోకి తీసుకురావాలని, ఆకివీడులో దళితులపై నిర్బంధాన్ని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. లేదంటే దళిత, గిరిజన ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు దాసరి రక్షణ కుమార్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు ఆవాజ్ నాయకులు ఎస్ డి హుస్సేన్, దాసు ,పెంద్ర శీను, శశి, జబ్బర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 4)

కందుకూరులో పట్టణ పోలీస్ స్టేషన్ దగ్గర ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారు సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ప్రయాణికులు, ఆటోడ్రైవర్లకు ఎమ్మెల్యే స్వయంగా మజ్జిగ అందించారు. చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన పట్టణ మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు షేక్ సలాంను ఎమ్మెల్యే, పోలీస్ అధికారులు అభినందించారు. అంతకు ముందు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు డిఎస్‌పి బాలసుబ్రమణ్యం, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ అన్వర్ బాషా, పట్టణ ఎస్ఐ శివ నాగరాజు, రూరల్ ఎస్ఐ బాలకృష్ణ, ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పశ్చిమబెంగాల్లో బిజెపి గెలుపు బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

## కొలిశెట్టి పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 4)

పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిల్లో బిజెపి గెలుపు దేశమంతా భారతీయ జనతా పార్టీ కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. మూడు దఫాలుగా మమతా బెనర్జీ క్రూరపాలనకు బిజెపి పార్టీ ఎట్టకేలకు తెరదించింది. ఈ అద్భుత విజయాన్ని బద్వేల్ పట్టణంలో బిజెపి కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో బద్వేల్ నాలుగు రోడ్ల సెంటర్లో పటాసులు పేల్చి, మిఠాయిలు తినిపించుకుంటూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొలిశెట్టి పవన్ కుమార్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్లో మరియు అస్సాం, పుదుచ్చేరిలో బిజెపి గెలుపు చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన విషయం అని ఆయన హర్షం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ మమతా బెనర్జీ కోరలు పీకి బిజెపి గెలుపుకు నాంది పలికారు అని ఆయన తెలిపారు. బద్వేల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు ధర్మిశెట్టి వెంకటసుబ్బరాయాలు మాట్లాడుతూ మే 4వ తేదీ కోసం బిజెపి కార్యకర్తలు అంతా యావత్ దేశ ప్రజలంతా ఉత్కంఠంగా ఎదురు చూసినందుకు బిజెపి గెలుపు అందరికీ ఎంతో నూతన ఉత్సాహాన్ని ఇచ్చింది అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కడప జిల్లా బిజెపి సెక్రటరీ కొలిశెట్టి రమణయ్య, బిజెపి కడప జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు అశోక్ రెడ్డి, బిజెపి బద్వేల్ రూరల్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు కుప్పల నరసింహులు, సుధాకర్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ రామకోటి రాజు, పాండు, భాజపా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలు, ఇళ్ళలో దొంగతనాలు చేస్తున్న వ్యక్తి అరెస్టు

## 40 గ్రాముల బంగారు నగలు, 25 తులాల వెండి పట్టీలు, రూ.20 వేల నగదు రికవరీ






(షణ్ముఖ వెలుగు, కంభం, మే 4)

ఇటీవల మార్కాపురం జిల్లా కంభం, అర్ధవీడు మండలాలల్లోని పలు దేవాలయాలు, ఇళ్ళలో జరుగుతున్న దొంగతనాల పై మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు సూచనల మేరకు మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు ఆధ్వర్యంలో కంభం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె మల్లికార్జున, కంభం ఎస్ఐ ఏ శివకృష్ణారెడ్డి, వారి సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసులను ఛేదించి సోమవారం ముద్దాయిని మండల కేంద్రంలోని చెరువు కట్టకు వెళ్ళు దారిలో గల అంకాలమ్మ గుడి సమీపంలో ముద్దాయి భూపని సాయి ని అరెస్ట్ చేసి, కేసులకు సంబంధించిన చోరి సొత్తును రికవరీ చేయడం జరిగిందని డిఎస్పీ యు నాగరాజు తెలిపారు. సోమవారం కంభం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముద్దాయి భూపని సాయి కంభం రంగారావు స్కూల్ నందు 8వ తరగతి వరకు చదువుకొని తర్వాత చదువు మానుకొని, కూలి పనులకు వెళ్తూ చెడు వ్యసనాలకు బాని సై, కూలి పనులు చేసుకోవడం వల్ల వచ్చే డబ్బులు తన వ్యసనాలకు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో గతంలో 2021 డిసెంబర్ నెలలో బేస్తవారిపేట మండలంలో దొంగతనాలు చేయడంతో పోలీస్‌లు అరెస్ట్ చేసి జైలుకు పంపడం జరిగింది. ఆ కేసులలో ఇతని పై సస్పెక్ట్ షీట్‌ను కూడా ఓపెన్ చేయడం జరిగింది. తరువాత అతను జైలు నుండి విడుదలయిన తరువాత



తిరిగి తన నేర ప్రవృత్తిని మార్చుకోకుండా తిరిగి అతని వ్యసనాలను తీర్చుకోవడానికి మరల దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ముద్దాయి 24.08.2025న అర్ధరాత్రి సుమారు 11:30 గంటల సమయంలో కంభం పట్టణంలోని షిరిడి సాయి నగర్ లో ఇంటికి తాళం పగలగొట్టి ఇంట్లోకి వెల్లి ఇంట్లో ఉన్న బీరువా తాళం పగలగొట్టి బంగారు నగలు, నగదును అర్ధరాత్రి దాటిన తరువాత కంభం పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ సమీపంలో గల దుర్గా వైన్ షాప్ వెనుక వైపు గోడకు గల కిటికీని పగలగొట్టి అందులో నుండి వైన్ షాపులోకి వెల్లి వైన్ షాప్ కాష్ కౌంటర్‌లో ఉన్న నగదును 04.04.2026 న రాత్రి సమయంలో, కంభం మండలంలోని నడింపల్లి గ్రామ చివర్లో గల ఒక ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు కమ్మలు, వెండి పట్టీలను గత నెల 17వ తేదీన రాత్రి సమయంలో రావిపాడు గ్రామంలో గల శ్రీ భీమేశ్వర స్వామి గుడి తలుపులు పగలగొట్టి అందులోని భువనేశ్వరి అమ్మవారి గుడిలో ఉన్న బంగారు తాళిబొట్టు, ఒక చిన్న ఉంగరము, వెండి పట్టీలు గత నెల 18వ తేదీ రాత్రి సమయంలో అర్ధవీడు మండలంలోని మాగుటూరు గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి తలుపులు పగలగొట్టి అందులోని హుండీని పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.10,000 డబ్బులు దొంగతనం చేశారు. అన్ని కేసుల్లో నేరస్తుడు దొంగలించిన రూ.2.50 లక్షల విలువ గల 20 గ్రాముల బంగారు నగలు, 25 తులాల వెండి పట్టీలు, రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా గతంలో కంభం గణేష్ నగర్‌లో జరిగిన దొంగతనం చేసిన ముద్దాయి చిన సైదా రావు అనే నేరస్తుడిని అరెస్ట్ చేసి, ఆ ఇంట్లో దొంగిలించిన 20 గ్రాముల నగలను రికవరీ చేయడం జరిగింది. పై కేసులను త్వరగా ఛేదించడంలో ముద్దాయిని చాకచక్యంగా అరెస్ట్ చేయడంలో, దొంగిలించిన పై సొత్తును రికవరీ చేయడంలో ప్రతిభ చూపిన కంభం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె మల్లికార్జున, కంభం ఎస్ఐ ఏ శివకృష్ణారెడ్డి, వారి సిబ్బంది, కానిస్టేబుల్‌లు వెంకటేశ్వర్లు, రంగస్వామిలను మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించారు.

# కార్పొరేట్‌కు ధీటైన సమాధానమిచ్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

### పదో తరగతి ప్రతిభావంతులకు ఘన సత్కారం

### ఉపాధ్యాయులకు ప్రత్యేక సన్మానం






(షణ్ముఖ వెలుగు, మార్టూరు, మే 4)

పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఘనంగా సత్కరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభావంతులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, చిన్నగంజాం మండలాలకు చెందిన పాఠశాలల్లో మొదటి, రెండో, మూడో స్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సత్కరించారు. విద్యార్థుల ప్రతిభకు తోడ్పడిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానిస్తూ, వారి కృషిని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత విద్యలోనూ మెరుగైన ఫలితాలు సాధించి, తల్లిదండ్రులు, పాఠశాలలు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే ఆరు మండలాలకు చెందిన ఎంఈఓలు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లను కూడా ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో, మంత్రి లోకేష్ నాయకత్వంలో విద్యాశాఖ అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు. విద్యాశాఖలో చేపట్టిన సంస్కరణల ఫలితంగానే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు.

# గాలివాన బీభత్సం

## అర్బన్ కాలనీలో ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు

## తీవ్ర ఆస్తి నష్టం



(షణ్ముఖ వెలుగు, కంభం, మే 4)

కంభం పట్టణంలోని అర్బన్ కాలనీలో ఆదివారం రాత్రి వచ్చిన గాలివాన తీవ్ర బీభత్సం సృష్టించింది. భారీ ఈదురుగాలులతో కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్ల పై రేకులు సుమారు 200 మీటర్ల దూరం వరకు ఎగిరిపోయాయి. ఈ





ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించినప్పటికీ, పేద కుటుంబాలకు గణనీయమైన ఆస్తి నష్టం వాటిల్లింది. ఘటన సమాచారం అందుకున్న వెంటనే సచివాలయ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన నష్టాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాలను పరామర్శిస్తూ పరిస్థితిని అంచనా వేశారు. ఈ



సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ నూరుల్లా ఖాద్రి, కంభం టిడిపి ప్రధాన కార్యదర్శి జెడి బాబు, టిడిపి నాయకులు మేడిగా శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.

# 123 మందికి ఉచిత హ్యాండ్ ఎక్స్ రే పరీక్షలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 4)

మండలంలోని కాటూరివారిపాలెం గ్రామంలో మార్కాపురం జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 123 మందికి ఉచిత హ్యాండ్ ఎక్స్ రే పరీక్షలు నిర్వహించారు. పొదిలి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శరత్ చంద్ర గారు మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, తరచూ మద్యం సేవించేవారు, పొగ త్రాగేవారు, పొగాకు వేసుకునేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు ఈ హ్యాండ్ ఎక్స్ రే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 14 సంవత్సరాలు పైబడిన 123 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో ఐదుగురిని అనుమానిత క్షయ వ్యాధిగ్రస్తులుగా గుర్తించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి శరత్ చంద్ర, సూపర్ వైజర్ కె మెరీనా, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, టీబీ యూనిట్ సిబ్బంది నాగరాజ కుమారి, రమణ బాబు, లక్ష్మీరెడ్డి, మణికంఠ, ఎంఎల్‌హెచ్‌పి చౌడేశ్వరి, ఏఎన్‌ఎం మాధవి, ఇతరత్రా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. పొదిలి మండలంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం సోమవారం నుండి శనివారం వరకు కాటూరివారిపాలెం, రాజుపాలెం, పొదిలి 1, పొదిలి 2, పొదిలి 4, పొదిలి 5 సచివాలయాల్లో ఆరు రోజులు క్యాంపులు జరుగుతాయని వైద్యాధికారి శరత్ చంద్ర తెలిపారు.

## అమరజీవి దాచూరి రామిరెడ్డికి ఘన నివాళులర్పించిన యూటీఎఫ్ నాయకులు



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, మే 4)

పట్టణంలోని యూటిఎఫ్ కార్యాలయంలో అమరజీవి దాచూరి రామిరెడ్డి వర్ధంతి వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య అధ్యక్షత వహించి ప్రారంభ ఉపన్యాసం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ నాయకులు రవీంద్రారెడ్డి అమరజీవి దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర కౌన్సిలర్ రమణారెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు తోట కృష్ణయ్య తదితరులు దాచూరి రామిరెడ్డి యూటీఎఫ్ సంఘ పటిష్టతకు, డైరీ, అధ్యాపక దర్శినిలో ముఖ్య పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి మాధవి దేవి, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, బాల వెంకటేశ్వర్లు, రఘురాం, రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు జయ చంద్రారెడ్డి, మహానందిరెడ్డి, రంగనాయకులు, వెంకటేశ్వరరెడ్డి, ఈ వెంకటేశ్వర్లు, నాగరాజు, మూడు మండలాల బాధ్యులు, సభ్యులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు. దాచూరి రామిరెడ్డి ఆశయ సాధన కోసం ప్రభుత్వ పాఠశాల ఎన్రోల్మెంటు డ్రైవ్ సమర్థవంతంగా నిర్వహించాలని, పాఠశాలలో ఒక గంట అదనంగా పనిచేయాలని మార్కాపురం జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య పిలుపునిచ్చారు.

## గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 4)

ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు జాతీయ నాయకుల జీవిత చరిత్రలు మొదలగు పుస్తకాలు చదివించి అనంతరం పిల్లలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసే క్రమంలో వారికి క్యారమ్స్, పోటీలు నిర్వహించారు. చివరిగా గ్రంథాలయ భవన దాత కోటిరెడ్డి సుచరితారెడ్డి స్వర్గీయ దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి పేరు మీద విద్యార్థులకు స్నాక్స్ అందించి పిల్లల ప్రేమకు పాత్రులైనారు. వారికి గ్రంథ పాలకుడు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి మొత్తం 19 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.

# తమిళనాడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాబోతున్న విజయ్‌కి శుభాకాంక్షలు

**139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు**



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 4)**

తమిళనాడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాబోతున్న విజయ్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు ఇదేవిధంగా రానున్న 2029వ సంవత్సర ఎన్నికలలో భారత చైతన్య యువజన పార్టీ కూడా విజయం సాధించి రామచంద్ర యాదవ్ ముఖ్యమంత్రి కావడం ఖాయం అని శ్రీనివాసులు తెలిపారు. స్వాతంత్రం వచ్చిన అప్పటినుండి నేటి వరకు రెండు పార్టీలు, రెండు కులాలు మాత్రమే అధికారాన్ని అనుభవించారని, వీటికి వ్యతిరేకంగా బీసీవై పార్టీ ఆవిర్భవించిందన్నారు. రానున్న ఎన్నికల్లో తమిళనాడు తరహాలో బీసీవై పార్టీ విజయం సాధించబోతుందని అన్నారు. నేడు ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కడ ప్రజలకు అన్యాయం జరిగిన స్పందిస్తూ పోరాడుతున్నటువంటి రామచంద్ర యాదవ్‌ని అన్ని వర్గాల ప్రజలు అభినందిస్తున్నారన్నారు. ఇదే రాజకీయ మార్పుకు నిదర్శనమని అన్నారు. నేడు రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నటువంటి పార్టీ బీసీవై పార్టీ ఒకటేనని, దానిని ప్రజలు అర్థం చేసుకున్నారని శ్రీనివాసులు తెలిపారు. 2029వ సంవత్సరంలో ముఖ్యమంత్రిగా రామచంద్ర యాదవ్‌ని చూడటమే ప్రజల ఆకాంక్షాన్ని తెలిపారు.

# యాదాళ్ల వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం మజ్జిగ వితరణ





**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 4)**

ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సామాజిక సేవే లక్ష్యంగా బద్వేల్ పట్టణంలో మజ్జిగ వితరణ కార్యక్రమం అనేక దపాలుగా నిర్వహించడం జరుగుతుంది, స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రం ప్రాంగణంలో సోమవారం, పలువురు పాదాచారులకు మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. స్వర్గీయ యాదాళ్ల వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం, ఆమె భర్త యాదాళ్ల సుబ్రహ్మణ్యం మరియు కుమారుడు సురేంద్రల సహకారంతో సుమారు 500 మందికి పైగా బాటసారులకు, ప్రజలకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఎండ వేడితో అలమటిస్తున్న వారికి ఈ మజ్జిగ వితరణ ఎంతో ఊరటనిచ్చింది.

దాతలను అభినందించిన

**మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘ అధ్యక్షులు కేవీ సుబ్బారావు**

ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘ అధ్యక్షులు కేవీ సుబ్బారావు మాట్లాడుతూ మండుతున్న వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడం గొప్ప విషయమని కొనియాడారు. మాతృమూర్తి జ్ఞాపకార్థం ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం వారి కుటుంబ సభ్యుల సేవా దృక్పథానికి నిదర్శనమని, ఇది అందరికీ ఆదర్శనీయమని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కొలిశెట్టి వెంకటసుబ్బయ్య, సుబ్బారావు, మేడ గురుబ్రహ్మం సతీమణి సుధారాణి, వల్లంకొండు అనిత్, జొన్నలగడ్డ సుధాకర్, యాదాళ్ల కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వేసవిలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని జరగాలని పలువురు ఆకాంక్షించారు.

# దళిత నేత నీలం కృషితో ఎస్సీ, ఎస్టీ హత్య కేసులో మూడేళ్ల తర్వాత బెస్త బికి ప్రభుత్వ ఉద్యోగం

## బాపట్ల జిల్లాలో మొట్టమొదటి ఉద్యోగ ఉత్తర్వులు ఇచ్చిన ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)**

మూడేళ్ల క్రితం చీరాల మండలం తోట వారి పాలెం లో దారుణ హత్యకు గురైన దొనంపూడి సురేందర్ అను ఎస్సీ యువకుడి హత్య కేసులో దళిత నేత నీలం కృషితో ఎట్టకేలకు ప్రభుత్వ ఉద్యోగం మంజూర అయింది. 2022వ సంవత్సరం జిల్లాల పునర్విభజన సమయంలో చీరాల మండలం బాపట్ల జిల్లా పరిధిలో ఉంది, ఈ క్రమంలో 2023 మార్చి 29వ తేదీన చీరాల మండలం తోటవారి పాలానికి చెందిన మార్పు సురేందర్‌ను ఇతర కులస్తులు కొందరు ఎస్సీ ఎస్టీలతో కలిసి హత్య చేశారు. సురేంద్ర శవాన్ని ఈపుర పాలెం స్ట్రైట్ కట్ డ్రైనేజీలో వేసి హత్యకు ఆనవాళ్లు లేకుండా చేశారు. తరువాత స్ట్రైట్ కట్ ప్రక్కన పందులను కోసి సురేంద్ర శవం వాసన రాకుండా జిమ్మిక్కు చేశారు. ఈపురుపాలెం పోలీసులు సురేంద్ర హత్యను మొదట మిస్సింగ్ కేసుగా క్రైమ్ నెంబర్ 88/23 31 మార్చి 2023న నమోదు చేశారు. తరువాత హత్య కేసుగా మార్చారు. తరువాత దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు తోటవారిపాలెం వెళ్లి అతని భార్య బెస్తబి, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. తరువాత అప్పటి చీరాల డిఎస్పి ఆఫీసుకు వెళ్లి ఈ ఎస్సీ కులానికి చెందిన ఎస్సి, ఎస్టి హత్య కేసులో ఎస్సీ ఎస్టీ యాక్ట్ వేయాలని డిమాండ్ చేశారు. ఈ ఎస్సీ కులస్తుడి హత్య కేసులో ఎస్టీలు ముగ్గురు ఉన్నారని ఎస్సీ ఎస్టీ యాక్ట్ వేయటంపై పరిశీలిస్తున్నామని చీరాల డిఎస్పి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కులస్తుల హత్య కేసుల్లో ముద్దాయిలు ఎస్సీలు ఎస్టీలు ఎంతమంది ఉన్నా బీసీలు లేక ఓసి కులానికి చెందినవారు ఒక్కరు ఉన్నా గాని ఎస్సీ ఎస్టీ యాక్ట్ వర్తిస్తుందని, అలాగే ఈ కేసులో ఇద్దరు ముద్దాయిలు బీసీ కులానికి చెందినవారు ఉన్నారు కాబట్టి ఎస్సీ, ఎస్టీ యాక్ట్ వేయాలని అప్పటి బాపట్ల జిల్లా ఎస్పీకి దళిత నేత నీలం నాగేంద్రరావు ఫిర్యాదు చేశారు. తరువాత బెస్తబి కి కేవలం ఎనిమిది లక్షల పాతికవేల రూపాయలు రిలీఫ్




బాపట్ల కలెక్టర్ మంజూరు చేశారు. కానీ బెస్తబికి రావలసిన ప్రభుత్వ ఉద్యోగం, ఎస్సీ, ఎస్టీ మంత్లీ పెన్షన్ మాత్రం మంజూరు చేయలేదు. అంతట మరలా నీలం నాగేంద్రరావు పూర్వపు బాపట్ల జిల్లా కలెక్టర్ మురళిని కలిసి దస్తబికి ఎస్సీ, ఎస్టీ మంత్లీ స్పెషల్ పెన్షన్, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత బాపట్ల జిల్లా కలెక్టర్‌కు కారుణ్య నియామకాలు లేదా ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఉద్యోగాలు ఇచ్చే అధికారం లేదు. అందువలన ప్రకాశం జిల్లా కలెక్టర్ బెస్తబి కి ఉద్యోగం ఇవ్వాలని కలెక్టరేట్ వారు రొటీన్‌గా లేఖ రాశారు. కానీ బాపట్ల కలెక్టరేట్ వారు ఉద్యోగానికి రికమాండ్ చేస్తూ లేఖ రాయలేదని, ప్రకాశం జిల్లా కలెక్టరేట్ వారు సదరు లేఖను తిప్పి పంపారు. ఈ విధంగా బెస్తబికి రావలసిన బెన్ఫిట్స్ రాకుండా, ఇవ్వకుండా బంతాటాడారు. మరలా దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులు నీలం నాగేందర్రావు ప్రకాశం జిల్లా కలెక్టరేట్ అధికారులతో మాట్లాడి బాపట్ల కలెక్టర్ వినోద్ కుమార్‌తో మాట్లాడి బెస్తబి ఫైల్‌కు చలనం కలిగించారు. బాపట్ల మెజిస్టేరియల్ సూపరెంట్ భాష బెస్తబి ఫైల్ నడపటంలో తీవ్ర అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించారు. మరలా నీలం నాగేంద్రం ప్రకాశం జిల్లా డిఆర్ఓ ఓబులేసు ద్వారా బాపట్ల జిల్లా డిఆర్ఓ గంగాధర్ గౌడ్‌కి ఫోన్ చేయించి బెస్తది త్వరగా పంపమని చెప్పించారు. మరలా బాపట్ల వెళ్లి ఎస్సీ, ఎస్టీ హత్య కేసుల్లో బాధితులకు జీవో నెంబర్ 95 ప్రకారం రిలీఫ్ తో పాటు ఎస్సీ, ఎస్టీ మంత్లీ పెన్షన్, ప్రభుత్వ ఉద్యోగం వెంటనే ఇవ్వాలని కానీ బాపట్ల జిల్లాలో మూడేళ్లయినా బాపట్ల జిల్లా ఏర్పడి నాలుగేళ్లయిన ఇంతవరకు ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని గుర్తు చేశారు. ఎట్టకేలకు బెస్తబి ఫైల్ ఒంగోలు కలెక్టరేట్ కి చేరిన తర్వాత జిల్లా కలెక్టర్ రాజాబాబు తో కలిసి బెస్త బికి చిన్న వయసు అని, చిన్న పిల్లలు ఉన్నారని ఆమె రక్షణ దృష్ట్యా ప్రస్తుత బాపట్ల జిల్లా చీరాలలో రెవెన్యూశాఖలో ఉద్యోగం ఇవ్వాలని కోరామన్నారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్లో జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్ రాజాబాబు, దళిత నేత నీలం సమక్షంలో మూడేళ్ల క్రితం హత్యకు గురైన సురేంద్ర భార్య బెస్త బికి ఎస్సీ, ఎస్టీ మంత్లీ పెన్షన్, రెవెన్యూ శాఖలో ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగ ఉత్తర్వులు ఇచ్చారు. బాపట్ల జిల్లా చరిత్రలోనే బెస్తబికి ఇచ్చిన ఉద్యోగం మొట్టమొదటిదని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా కార్యదర్శి దారా అంజయ్య, కాకుమాను రవి, మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ పత్రా బంగారం, సమతాధల్ కన్వీనర్ మేడికొండ మురళి, తదితరులు ఉన్నారు.

# మార్కాపురంలో భూ వివాదం తీవ్రం కలెక్టర్‌కు సయ్యద్ కుటుంబం వినతి



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 4)**

మండలంలోని ఇడుపూరు గ్రామంలో భూ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి చెందిన సయ్యద్ కుటుంబం తమకు చెందిన వ్యవసాయ భూమిని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పిఆర్‌జిఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీతను ఆశ్రయించింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సర్వే నంబర్లు 954-2, 955, 957-1లోని భూమి పై తమకే పూర్తి హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనికి సంబంధించి ఆధార్, ఈసీ సహా పాత పత్రాలను అధికారులకు సమర్పించినట్లు తెలిపారు. గ్రామ సచివాలయం సర్వేయర్ చేసిన కొలతల్లో మార్పులు చోటు చేసుకున్నాయని, దీంతో అసలు భూస్వాములకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు అర్జీలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కలెక్టర్‌కు వివరించారు. భూ వివాదంతో జీవనోపాధి దెబ్బతిందని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు వాపోయారు. తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గాలి, వాన బీభత్సం నేలకొరిగిన చెట్లు, కరెంటు స్తంభాలు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 4)**

ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఈదురు గాలులకు ఒంగోలు నగరంలో పలు డివిజన్ చెట్లు, కరెంటు స్తంభాలు నేలకొరిగాయి కొన్ని గంటలపాటు కరెంటు స్తంభించింది. హౌసింగ్ బోర్డు కాలనీలో చెట్లు విరిగి రోడ్డు పడడంతో అలాగే కరెంటు స్తంభాలు తిరిగి ఇంటి మీద పడ్డాయి ఆ సమయంలో కరెంటు సప్లై లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది, త్రోవగుంట కరవాది కి వెళ్లే దారిలో ఈదురు గాలులకు అతి భారీ వృక్షం రోడ్డు అడ్డుగా పడడంతో వాహనదారులు, అటువైపు గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు, ఒంగోలు నగరంలో పలు ఎగ్జిబిషన్‌లు రన్నింగ్‌లో ఉన్నప్పుడు గాలి బీభత్సానికి కొన్ని కింద పడ్డాయి. ఎగ్జిబిషన్ స్థలాన్ని ఒంగోలు నగర డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ఆదేశాల మేరకు పలు డివిజన్‌లో డివిజన్ నాయకులు డివిజన్‌లో ఏర్పడ్డ ఇబ్బందులు తెలుసుకొని చెట్లను, కరెంటు స్తంభాలను సంబంధిత అధికారులతో మాట్లాడి క్లియర్ చేయించారు.















On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com